మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



### ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల

## ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఇండియన్ ఎయిఫోర్స్‌లో అగ్నివీర్‌వాయు(మ్యూజిసియన్) ఉద్యోగాల భర్తీకి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఈ అవకాశాన్ని జిల్లాలో అసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి గురువారం సూచించారు. 1 జనవరి 2005 నుంచి 01 జూలై 2008 మధ్య జన్మంచి టెన్త్ ఉత్తీర్ణత లేదా తస్సమాన పరక్ష ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. మే 11 లోగా హెచ్‌టిటిపిఎస్://ఎజిఎన్‌ఐపిఎటిహెచ్‌విఎవైయు.సిడిఎసి.ఐఎన్ వెబ్‌సైట్‌లో అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శారీరక పరీక్ష, ప్రావీణ్య పరీక్ష, రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్ ఎయిర్మెన్ సెలెక్షన్ సెంటర్ బెంగళూర్(కర్ణాటక)లో ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 09511947457 నంబరు లేదా మెయిల్ ఐడి డిఇఎఫ్‌ఈఎన్‌డిఈఆర్–ఆర్‌ఓఎల్‌ఎల్‌ఈఆర్‌ఎస్.జిఓవి.ఐఎన్ సంప్రదించాలన్నారు.

## దుర్గమ్మ సన్నిధిలో నర్సాపూర్ జడ్జి

**పాపన్నపేట, మే 1, ప్రభాతవార్త :** ఏడు పాయల వన దుర్గ భవానీ మాతను నర్సాపూర్ ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ హేమలత గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమెకు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి వారి పేర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట వేద పండితులకు శంకర శర్మ, పార్థివ శర్మతోపాటు ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, బత్తిని రాజు, వరుణాచారి, నర్సింలు తదితరులున్నారు.





ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

## నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**బెజ్జంకి, మే 1, ప్రభాతవార్త :** ప్రభుత్వ నిబంధనలమేరకే లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్లను 600 చదరపు అడుగులలోపే నిర్మించుకోవాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సందర్శనలో భాగంగా ఫైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండల పరిధి లోని వీరాపూర్ గ్రామాన్ని గురువారం ఆమె సందర్శించారు.గ్రామంలోని లబ్దిదారులతో అమె నేరుగా మాట్లాడి ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. బేసమేట్ లెవెల్ బిల్లులు రావడం లేదని నలుగురుకి మంజూరు రాలేదని మంజూరు ఇప్పించాలని కోరాగా రెండో విడతలో అవకాశం కల్పిస్తామన్నారు. గ్రామంలో 77 ఇండ్లు మంజూరు కాగా మొదటి దశలో 33 మంది లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందని వాటిలో 21 మంది లబ్దిదారులు మాత్రమే ఇంటి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఇంటి నిర్మాణాలు ప్రారంభిస్తే బిల్లులు వెంట వెంటనే వచ్చేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్న పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట హౌసింగ్ పిడి దామోదర్‌రెడ్డి, ఎంపిడిఓ కడవెర్గు ప్రవీణ్, ఎపిఎం నర్సయ్య, ఎఈ పిఆర్ సమ్మయ్య, ఎంపిఓ మంజుల, ఆర్ఐ సంతోష్, పంచాయతీ కార్యదర్శి బాబు తదితరులు ఉన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్లు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో మార్కెట్ కమిటీ చైర్మన్లు

**గజ్వేల్, మే 1 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కొండ పాక, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్లుగా నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్‌లు గురువారం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్లను మంత్రి శాలువాతో సన్మానించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ త్వరలోనే గజ్వేల్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాజిద్‌బేగ్, రాజేశ్వర్‌గుప్త, సురేష్ తదితరులు ఉన్నారు.

## పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### రాష్ట్ర ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్



రాజగోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**నంగునూర్, మే 1, ప్రభాతవార్త :** ప్రభుత్వ ప్రాథమికనఆరోగ్య కేంద్రాలకు, ఆసుపత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ బి.రవీందర్‌నాయక్ అన్నారు. గురువారం మండలపరిధిలోని రాజగోపాల్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధవహించి మెరుగైన సదుపాయాలు ఉన్న ఆసుపత్రులకు ప్రసవానికి పంపించాలన్నారు. ఆశా కార్యకర్తలు 102 వాహనాల ద్వారా గర్భిణీలను ట్యాగ్ సెంటర్లకు తీసుకరావాలన్నారు. తల్లి బిడ్డల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పిల్లవాడికి వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం సమయానికి అందేలా చూడాలన్నారు.క్షయవ్యాధి, లెప్రసీ,హైపర్ టెన్షన్, షుగర్‌వంటి అసంక్రమిత వ్యాధులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జిల్లా ఆరోగ్య కార్యకలాపాల్లో రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలంటే అన్ని ఆరోగ్య సూచికల్లో అభివృద్ధి సాధించాలన్నారు. ఆయన వెంట డిఎం అండ్ హెచ్ఓ బి.పల్వన్‌కుమార్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓలు రేవతి, శ్రీనివాస్, ప్రోగ్రాం అఫీసర్లు అనంద్, నారాయణ్‌రావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆసుపత్రిలోని ఓపి రిజిస్టర్లు, ఫార్మసీ స్టోర్,లాబోరేటరీలు, వార్డులను పరిశీలించారు. అలాగే రికార్డుల నిర్వహణ, మందుల నిల్వలపై సమీక్షించారు.

## కమిషనర్‌ను కలుసుకున్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, మే 1, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి కమిషనర్‌గా బాద్యతలు స్వీకరించిన ఆర్‌వీ కర్ణన్‌ను గురువారం రామచంద్రాపురం డివజన్ కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ నగర మేజయ్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి పూలమొక్కను అందించారు. రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధి కమిషనర్‌తో చర్చించినట్లు కార్పోరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ పేర్కొన్నారు.




జిహెచ్ఎంసి కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వీ కర్ణన్‌కు కలుసుకున్న కార్పొరేటర్ పుష్ప

# గ్రామ గ్రామాన ఘనంగా మే డే వేడుకలు




గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు



కొమురవెల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



నర్సాపూర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో....



చిన్నకోడూరులో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



చేబర్తిలో బిఎస్ఆర్‌కెవిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న కార్మికులు



శివంపేట్ సిబిఎల్ పరిశ్రమలో...




గజ్వేల్‌లో మాట్లాడుతున్న డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



నాగల్‌గిద్దలో మేడు వేడుకలను జరుపుకుంటునన్న కార్మికులు



మనూర్‌లో సిఐటియు జండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

**గజ్వేల్, మే 1 (ప్రభాతవార్త):** పట్టణంలో మేడే వేడుకలను వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వద్ద తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి పాశికంటి నర్సింలు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకుడు గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి కానుగుల రమణాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శివలింగ కృష్ణ, ఏఐటియుసి నాయకులు మెట్టు శ్రీను, పోచయ్య, మల్కగల్ల యశ్వంత్, ఆసుపత్రి వైద్య సిబ్బంది నర్సింగ్, సూపరింటెండెంట్ సువర్ణ, స్వరూపరాణి, ఐఎన్‌టియుసి డివిజన్ ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, ఆరోగ్య మిత్ర సురేందర్, ఎల్‌టి రాము, తిరుపతిరెడ్డి, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజ్ఞాపూర్‌లో...**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఖాసీం, బెదరమైన కుమార్, చంద్రం, ఎల్లేష్, అక్బర్, నర్సింలు, షబ్బీర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**సిఐటియు ఆధ్వర్యంలో...**

కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఐటియు ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించడంతోపాటు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దుచేసి బానిసలుగా మార్చే విధంగా కోడ్‌లు రూపొందించడం జరిగిందన్నారు. కార్మికులు వంద సంవత్సరాలపాటు కొట్లాడి 8 గంటల పని విధానం సాధించుకుంటే మోడి ప్రభుత్వం 12 గంటలు పనిచేయాలని చట్టాలు తయారుచేస్తుందని విమర్శించారు. వెంటనే కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ కంపెనీలకు తక్కువ ధరలకు అమ్మివేయడం జరుగుతుందని, కార్పోరేట్ లాభాల కోసం కేంద్రం పనిచేస్తుందన్నారు. ప్రజల మధ్య కులం, మతం పేరుతో ఐక్యతను విచ్ఛిన్నం చేసి మభ్య పెట్టడం జరుగుతుందన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వద్దకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి, రంగారెడ్డి, వేణుగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, కుమార్, ప్రవీణ్, స్వామి, ఎల్లయ్య, గౌస్, రమేష్ పాల్గొన్నారు.

**కొమురవెల్లిలో...**

**కొమురవెల్లి, మే 1, ప్రభాతవార్త :** దేశంలో బిజెపి సర్కారు కార్మిక హక్కులను పూర్తిగా కాలరాస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సత్తిరెడ్డి అన్నారు. మే డే పురష్కరించుకొని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. అలాగే మండల పరిధిలోని ఆయా గ్రామాలలో జెండాలను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర సర్కారు రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లెబర్ కోడ్లను తీసుకవచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. మోడీ తీసుకొచ్చిన నాగులు లెబర్ కోడల్‌ను రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్నారు. మే 20న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు,వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడూరి రవీందర్, అత్తిని శారద, కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, సాయిలు, తాడూరి మల్లేశం, రవి,భరత్‌కుమార్, రాజు, ఎల్లయ్య, మల్లయ్య, యాదయ్య, కిష్టయ్య, నరసింహులు, కిషన్ పాల్గొన్నారు.

**నర్సాపూర్‌లో...**

**నర్సాపూర్, మే 1 ప్రభాతవార్త :** కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటాలతో హక్కులను చట్టాలను రక్షించుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు అన్నారు. గురువారం మే డేను పురస్కరించుకొని సిఐటియు ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణం వివిధ గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కడారి నాగరాజు మాట్లాడుతూ మేడేను అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా కార్మికుల పండుగ గా జరుపుకుంటారన్నారు. చికాగో నగరంలోని మార్కెట్లో జరిగే శ్రమ దోపిడికి వ్యతిరేకంగా 8 గంటల పని దినం కోరుతూ లక్షలాదిమంది కార్మికులు పోరాటం చేశారన్నారు. కార్మికుల హక్కుల రక్షణకై తమ ప్రాణాలను సైతం అర్పించారని తెలిపారు. ఈ మేడే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతకు సంకేతం అని ఆయన పేర్కొన్నారు. 1890 సంవత్సరమే 1న పాలకవర్గం దిగివచ్చి కార్మిక సంస్థ మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలని సూచించిందని అన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు మే 1న మేడేను జరుపుకుంటున్నామన్నారు. కార్మిక వర్గం ఐకమత్యమై పెట్టుబడుల దారి వర్గాలను పాలకవర్గాలను కూల్చడానికి. కార్మికుల హక్కుల, చట్టాలను కాపాడుకోవడానికి, కార్మికవర్గ ఐక్యతను చాటడానికి అన్ని రంగాల కార్మికులు జెండాలను ఎగురవేస్తారన్నారు. కార్మిక వర్గ 4 లేబర్ కోడ్ లా రద్దులకై, రాజ్యాంగాన్ని కాపాడుటకై కార్మికులందరూ కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని కడారి నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అన్నపూర్ణ పుష్ప రాములు రిజ్వానా ఆంజనేయులు గౌడ్ భీమేష్ షుకూరు శ్రీనివాస్ సుమేష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

**చిన్నకోడూరు, మే 1, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు, మండల అధ్యక్షులు చెరుకు నారాయణ ఆధ్వర్యంలో గురువారం మే డే సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి నాయకులు కార్యాలయాలవద్ద మే డే సందర్భంగా కార్మిక జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు కోరమైన రవి, మంకాళి ఎల్లయ్య, లింగం, రాజు, మల్లేశం, హమాలీ కార్మికులు బంక రాజయ్య, గాజుల బాబు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**మర్కుక్ మండలంలో...**

**మర్కుక్, మే 1 (ప్రభాతవార్త):** మేడే దినోత్సవం సందర్భంగా కార్మికులు పలు గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించి మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేబర్తిలో బిఎస్ఆర్‌కెవిఎస్ ఆధ్వర్యంలో సంఘం జెండాను ఆవిష్కరించి జై కార్మిక జై జై కార్మిక అంటూ నినాదాలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ర్యాకం యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ స్వామి, ఆంజనేయులు, భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సిబిఎల్ పరిశ్రమలో...**

**చౌటకూరు, మే 1, ప్రభాతవార్త:** మేడేను పురష్కరించుకుని గురువారం మండల పరిధిలోని శివంపేటలోని సిబిఎల్‌పరిశ్రమలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, సిబిఎల్ పరిశ్రమ యూనియన్‌అధ్యక్షులు కామ్రేడ్ చుక్కా రాములు జండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ 8గంటల పనిదినాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని, అందుకు మే 20వ తారీఖున జరుగబోయే జాతీయ సమ్మెలో పాల్గొనాలని కార్మికులకు సూచించారు. కార్మికుల హక్కుల సాదన కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకోవడం, కార్మికులు సమాజానికి ఎంతగానో దోహదపడుతున్నారో గుర్తు చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి బాగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసన్న, కాంట్రాక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్, ఎంప్లాయిస్, కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు, కార్మికులు, మహిళలు పాల్గొన్నారు. మండల కేంద్రమైన చౌటకూరులోని పంచాయితీ కార్మికులు జండాను ఆవిష్కరించి మేడేను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బాలరాజ్, పంచాయితీ కార్మికులు వీర, ఆయా గ్రామాల నుంచి కార్మికులు చేరుకుని మేడేను ఘనంగా జరుపుకున్నారు.

**మనూర్‌లో...**

**మనూర్, మే 1, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌లో గురువారం మేడే వేడుకలను సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మేడేను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సిఐటియు జండాను డివిజన్ నాయకులు కోతారి నర్సింలు ఆవిష్కరించి ప్రసంగించారు. కార్మికులకు కనీ వేతనం 18వేల రూపాయలను అందించాలన్నారు.కార్మికులందరికి పనికి సమానంగా వేతనం అందించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులపై చిన్నచూపు చూస్తోందని విచారం వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేస్తామని పార్లమెంట్‌లో హామి చేసి అమలు చేయడంలో విఫలం అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయకార్యదర్శి ఎస్ గణపతి, నాయకులు దత్తు, విఠల్, రఫిక్, నర్సప్ప, అంజప్ప పాల్గొన్నారు.

**నాగల్‌గిద్దలో...**

**నాగల్‌గిద్ద, మే 1, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో గురువారం మేడే వేడుకలను పురస్కరించుకుని సిఐటియు జండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గణపతి, కార్మికులు పాల్గొన్నారు.

### ఉపాధిహామీ హక్కులను కాపాడుకుందాం

**-డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్**

**గజ్వేల్ టౌన్, మే 1 (ప్రభాతవార్త):** మేడే కార్మిక పోరాట దినం స్పూర్తితో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ హక్కులను పరిరక్షించుకుందామని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ మండలం బయ్యారంలో ఉపాధి కూలీల సమక్షంలో మేడే సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా వచ్చిన కార్మిక, కర్షకుల హక్కులను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ పేరుతో సామాజిక భద్రత లేకుండా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధిహామీలో 100 నుండి 200 రోజులకు పెంచాలని, వేతనాలు రూ.317 నుండి రూ.700 వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా పని ముట్లను ఇవ్వాలని, నీరు, నీడ, వసతులు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, ఎఫ్ఏ మైసని మల్లయ్య, నాయకులు మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మహిళా సాధికారతకు పెద్దపీట

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో మే 1, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లాలో మహిళా సాధికారతకు పెద్దపేట వేస్తున్నామని కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం కలెక్టరేట్లోనీ మిని సమావేశ మందిరంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ మహిళా సాధికారతలో భాగంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా డ్రోన్లు, మహిళా పెట్రోల్ బంకులు, కమర్షియల్ కాంప్లెక్సు, ఇటుకల తయారీ, విద్యార్థులకు ఏకరూప దుస్తుల కుట్టు లాంటి కార్యక్రమాలు జిల్లాలో మహిళలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. మహిళా సంఘాల మహిళలు వారి ఉత్పత్తులైన లక్క బొమ్మలు, జూట్ బ్యాగులు తయారుచేసి సంగారెడ్డి జిల్లా పేరు మీద మంజీరా మహిళా శక్తి అనే స్టాల్‌ను శిల్పారామంలో ఏర్పాటు చేసి , వాటిని విక్రయించి జిల్లాకు దేశవ్యాప్తంగా గుర్తింపు తేవాలన్నారు.

న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల్లో ఉన్న మహిళలందరూ తప్పనిసరిగా 100 శాతం అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. డ్రోన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు 80శాతం సబ్సిడీ కింద డ్రోన్లు అందించలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మహిళా పెట్రోల్ బంకుల్ని ఈ నెలలో ప్రారంభించుకోవాలన్నారు.

క్యాబ్ డ్రైవర్ గా శిక్షణ పొంది, లైసెన్స్ తీసుకున్నా మహిళలకు జిల్లాలో ఉన్న ప్రైవేటు కంపెనీలలో డ్రైవర్లుగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.టూ వీలర్, 4 వీలర్ లాంటి వాహనాలను నడిపించే ఆసక్తి ఉన్నవారినీ హైదరాబాదులో ఉన్న శిక్షణ కేంద్రంలో శిక్షణ కల్పించి, ఆర్థిక సహాయం అందించి, ఉపాధి కల్పించాలన్నారు.మహిళా సాధికారత లో భాగంగా మహిళల్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పిడి. డిఆర్‌డి ఏ.జ్యోతి, పిడి మెప్మా గీత, సంబంధితశాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు .

## ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

**వర్గల్, మే 1 (ప్రభాతవార్త):**

మానసిక వేదనతో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వర్గల్ మండలకేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వర్గల్ గ్రామానికి చెందిన దాచా నాగరాజు(34) అనే యువకుడు గతకొంత కాలంగా క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు స్నానం చేసివస్తానని వారి ఇంటిపై ఉన్న పెంట్ హౌజ్ (రేకుల షెడ్)లోకి వెళ్ళి అందులో ఉన్న పైప్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. క్షయ వ్యాధితో బాధపడుతున్న నాగరాజు కొంత కాలంగా మానసికంగా కుంగిపోయి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని తండ్రి పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.


మాట్లాడుతునన్నదరిపల్లి చంద్రం

## ఐక్యపోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలి

**భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం**

**సిద్ధిపేట రూరల్, మే 1, ప్రభాతవార్త :** కార్మిక, కర్షక రాజ్యం కోసం కార్మికులు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం అన్నారు. మే డే ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుంది. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి దరిపల్లి చంద్రం, కార్మిక సంఘం నాయకులతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు కార్మికులతో కలిసి కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రౌడీయిజం చేస్తే చర్యలు : సిఐ


మాట్లాడుతున్న త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్

**సిద్ధిపేట అర్బన్, మే 1, ప్రభాతవార్త :** రౌడీయిజం, గుండాయిజం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ హెచ్చరించారు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కేడి, డిసి, రౌడీలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకొని మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకొని అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.గంజాయి ఇతర మత్తుపదార్థాల జోలికి వెళ్లదన్నారు. అన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లు పెట్టి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'ఆర్‌వైవి'పై సమావేశం

**చిన్నకోడూరు, మే 1, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఈనెల 2న రాజీవ్ యువ వికాసం పథకంపై బ్యాంకు మేనేజర్‌తో మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ జనార్దన్, ఎంపిఓ సోమిరెడ్డిలు తెలిపారు.

## పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన వసంత కుమారి


పిహెచ్‌సిని తనిఖీచేస్తున్న జిల్లాపశుసంవర్ధకశాఖ అధికారి వసంతకుమారి

**కంది, మే 1, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రాన్ని గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి బాధ్యులకు పలు సూచనలు చేశారు. పశువులు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆసుపత్రి డాక్టర్‌కు సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి ఎప్పటికి అప్పుడు పశువుల పోషణపై అవగాహన కల్పిస్తూ ఉండాలని ఆసుపత్రి డాక్టర్‌కు, సిబ్బందికి సూచించారు.

## రాజమౌళిని కలిసిన వంగపల్లి అంజయ్యస్వామి


రాజమౌళికి శ్రీశైలం ప్రసాదం అందజేస్తున్న అంజయ్యస్వామి

**గజ్వేల్ టౌన్, మే 1 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళిని గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, వాసవి ఉపాసకులు, ఆధ్యాత్మికవేత్త వంగపల్లి అంజయ్యస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజమౌళికి శ్రీశైలం మల్లికార్జునస్వామి లడ్డూ ప్రసాదంను అందజేశారు. అనంతరం అంజయ్యస్వామి మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా విధులు నిర్వహించిన రాజమౌళి అభినందనీయుడని, మున్సిపల్ అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషించిన ఆర్యవైశ్య నాయకుడు అన్నారు. నాచగిరిలోని వాసవి కన్యకా పరమేశ్వరి నిత్యాన్నదాన సత్రం గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతూ మంచి పేరు తెచ్చుకున్న రాజమౌళి పలువురికి ఆదర్శమన్నారు.

## ఎల్లమ్మ దేవాలయానికి రూ.51వేల విరాళం

**గజ్వేల్, మే 1 (ప్రభాతవార్త):** ప్రజ్ఞాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో అత్యంత సుందరంగా నిర్మించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని 3వ వార్డుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి రూ.51వేల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధి కోసం విరాళాన్ని అందించిన ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి ఎల్లమ్మతల్లి దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు ఈనెల 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరుగుతాయని గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## మండల టాపర్‌గా మల్యాల రేవతి

**దుబ్బాక, (అక్బర్‌పేట భూంపల్లి), మే 1, ప్రభాతవార్త:** అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని జెడ్పిహెచ్‌ఎస్ రామేశ్వరంపల్లి హైస్కూల్ మండల టాపర్ గా మల్యాల రేవతి తండ్రి రాజమల్లు కురుమ ముద్దు బిడ్డ రేవతి కి కురుమ సంఘం అధ్యక్షుడు కోనాపురం బాలమల్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్తె వెంకటేశం శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చౌదర్‌పల్లి మహంకాళి యూత్ అధ్యక్షుడు కొప్పుల స్వామి, మండల ఉపాధ్యక్షుడు పరశురాములు, కురుమ సంఘం నాయకులు చిన్న నిజాంపేట్ కురుమ సంఘం అధ్యక్షుడు కోనాపురం కనకయ్య, కొలుపుల గుట్టయ్య, షేర్వపురం బాలరాజు, బట్ట రాజు, బట్ట పర్శరాములు, పిరాల మహేష్, కోనాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీ వల్లే కుల గణనపై కేంద్రం ఆమోదం

**కాంగ్రెస్ నాయకులు**


రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్, మే 1 ప్రభాతవార్త :** ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తావనతో కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ జన గణనతో పాటు కుల గణను దేశవ్యాప్తంగా చేయాలని ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఏ ఐ సి సీ అగ్ర నేత రాహుల్ గాంధీ విజయమేనని, ఈ మేరకు కులగణనతో అన్ని వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కులగణ ను ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం ఆమోదం చేయడం రాహుల్ గాంధీ ప్రస్తావించడం తో విజయం సాధించిన నేపథ్యంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి. జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ లు మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ కులగణనపై ప్రస్తావించడంతోనే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి దేశవ్యాప్తంగా కులగణ ను చేయాలని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కులగణన తో పాటు బీసీ కులగణ నలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్ పంపడం తెలంగాణ ప్రభుత్వం విజేయమేనని అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్రను చేపట్టారని. దీంతో ఏ కులాల వారు ఎంత అభివృద్ధి చెందారు తెలుసుకొని దేశవ్యాప్తంగా కులగ లణ ను చేయాలని డిమాండ్ చేశారు. కులగణ న తో బీసీలకు రాజకీయ విద్య ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసిందని తెలిపారు. ఈ కులగణ న తో ఏ కులం ఎంత నిష్పత్తిలో ఉందో తెలుస్తుంది అన్నారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం నిర్ణయం తీసుకొని కులగణ న ను సర్వే చేసిందన్నారు. దేశ చరిత్రలోనే మొదటిసారిగా దేశంలో కుల గణన ను నిర్వహించారని తెలిపారు కులగణ న ను చేపట్టాలని రాహుల్ గాంధీ పలుమార్లు డిమాండ్ చేసిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని చివరకు ప్రజల ఒత్తిడి మేరకు కులగణ న కు ఒప్పుకొని పార్లమెంటులో ఆమోదం తెలిపింది అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం శాస్త్రీయంగా కుల గణనను విజయవంతంగాపూర్తి చేసి ఆదర్శంగా నిలిచిందని వారు పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో కాశ్మీర్ మారణకాండతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే కుల గణన పై, ఎస్సీ వర్గీకరణ పై, ప్రజలను రెచ్చగొట్టారని అన్నారు. అగ్ర నేత రాహుల్ గాంధీ చొరవతో కులగణనన జనగణన ను దేశవ్యాప్తంగా చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షించదగ్గ విషయమని ఆవుల రాజిరెడ్డి ఆంజనేయులు గౌడ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు జ్యోతి సురేష్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, మండల అధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రషీద్, మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్ గౌడ్, మండల మైనార్టీ అధ్యక్షులు అజ్మత్, నాయకులు దాడిగ నరేష్, అశోక్, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

## గజ్వేల్‌లో మోడి చిత్రపటానికి క్షీరాభిషేకం

**గజ్వేల్, మే 1 (ప్రభాతవార్త):** దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గర్నెపల్లి కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో మోడికి కృతజ్ఞతలు తెలుపుతూ గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మోడి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం బిసిలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ పెంచడంతో పాటు చట్ట సభలలో బిసిలకు రిజర్వేషన్లు మెండుగా ఉంటాయన్నారు. జనగణనతో పాటు కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. సామాజిక సమరసతను దృష్టిలో ఉంచుకొని కులగణన చేయాలని నిర్ణయించడం గొప్ప నిర్ణయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, పెండ్యాల శ్రీనివాస్, సుమతి, నాగు ముదిరాజ్, నాయిని సందీప్, మాద్గురి నరసింహ, వద్దేపల్లి ప్రసాద్, మైస విజయ్, సూర్యారావు, కాళ్ల సాయి, ఆనంద్, సంగెపు అనిల్, గోపాల్, ఎల్లం, అరుణ్, రాజేశ్వర్‌చారి, దువ్వల రాజు, కుంకుమ రాణి, గద్దమీది ప్రశాంత్, నీరజ, వినోద, మమత, సరిత, భక్తమాల, స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**బెజ్జంకి, మే 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వడ్లూర్ గ్రామానికి చెందిన పులి నర్సయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం బాధిత కుటుంబీకులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, ఎఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అలువాల కోటి, పులి సంతోష్‌లు పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కట్ట కొమురయ్య, పులి రమేష్, కుక్కల రాములు, చెక్కిళ్ల తిరుపతి, బెజ్జంకి అనిల్, పులి సందీప్, గాండ్ల రమణ,బిగుళ్ల మనోజ్, కుమ్మరి మల్లేశం తదితరులు ఉన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న కెసిఆర్ దంపతులు

**మర్కుక్, మే 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ మాజీ ఎంపిటిసి పెద్దోల్ల భాగ్యమ్మ, వెంకటయ్య దంపతుల కుమారుడు ఏఈఓ విష్ణువర్ధన్ వివాహం ఎర్రవల్లి గ్రామంలో గురువారం జరుగగా ఈ వివాహ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకకు కెసిఆర్ దంపతులు హాజరుకావడంతో నూతన వధూవరులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, మాజీ సర్పంచ్ భాగ్య బాల్‌రాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అందోల్ కృష్ణ

**చౌటకూరు, మే 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బద్రిగూడెంలో గురువారం జరిగిన వివాహ వేడుకలను సర్పంచుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు అందోల్ కృష్ణ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బద్రిగూడెం అధ్యక్షులు స్రవంతి ఆంజనేయులు ముదిరాజ్, యూత్ అధ్యక్షులు నాగరాజు, మండల బిసి సెల్ ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కె రంగాగౌడ్, చంద్రయ్య, యం వినోద్, వీరేశం, సిహెచ్ మహేష్, మోహన్‌కుమార్, ఎ విష్ణు, సి జనార్ధన్, సి మధు, సి రాములు, సి సిద్దయ్య, వి కుమార్, వి నరేష్, సాయిబాబా, డి శ్రీనివాసన, సి రాము, బి దశరథ్, సి కృష్ణ, వై నరేష్, పి విశ్వనాథ్, పి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


రాహుల్‌గాంధీ, సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

## రాహుల్, సిఎం, పిసిసి అధ్యక్షుడి చిత్రపటాలకు క్షీరాభిషేకం

**చిన్నకోడూరు, మే 1, ప్రభాతవార్త :** కేంద్ర కేబినెట్ జన గణనతో పాటు కుల గణన చేయాలని నిర్ణయం తీసుకోవడం ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ విజయమని వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు అంకర్ మధు అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో గురువారం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్ర పటాలకు పాలభిషేకం చేసి మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో బిసి కులగణన పకడ్బంధీగా నిర్వహించిందన్నారు. దేశంలో అన్ని వర్గాలకు న్యాయం చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండం శ్రీనివాస్‌రెడ్డి, వాసరి మల్లేష్, పల్లె రాజు,శ్రీకాంత్, మిట్టపల్లి మహేష్, బాబు, కట్కూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

## దుద్దెడ అభ్యుదయ యూత్ నూతన కార్యవర్గం


దుద్దెడ అభ్యుదయ యూత్ నూతన కార్యవర్గం

**కొండపాక, మే 1, ప్రభాతవార్త :** దుద్దెడ అభ్యుదయ యూత్ నూతన కార్యవర్గం గురువారం యూత్ గౌరవ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ అరెపల్లి మహదేవ్‌గౌడ్, చిలుముల రాంమోహన్ అధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. యూత్ అధ్యక్షులుగా బింగి వేణు, ప్రధాన కార్యదర్శిగా నర్ర సాయియాదవ్, ఉపాధ్యక్షులుగా కొంక శ్రీనివాస్, కోశాధికారిగా కోణం చంద్రం, కార్యదర్శులుగా గాడిపల్లి శ్రీనివాస్, పంజ చిరంజీవి, కార్యవర్గ సభ్యు లుగా గాజులపాటి రాజు, నర్ర అమరేందర్‌రెడ్డిలు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నుకొబడిన సభ్యులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి, యూత్ అభివృద్ధికి పాటుపడుతు సామాజిక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు అరెపల్లి రమేష్, మెత్కుపల్లి శ్రీనివాస్, అంజనేయులు, బాలకిషన్, నాగరాజు, కుమార్, కొంక చందు పాల్గొన్నారు.

## పేద వధువు వివాహానికి పుస్తెలు, మెట్టెలు అందజేత

**కొండపాక, మే 1, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల పరిధిలోని ముద్దపూర్ గ్రామానికి చెందిన ఒ వధువు వివహానికి గురువారం అదే గ్రామానికి చెందిన తూం శ్రీకాంత్‌రెడ్డి పుస్తెమెట్లెలను అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిరుపేదలకు సహాయం చేయడంలోనే నిజమైన తృప్తి లభిస్తుందన్నారు. తన తండ్రి మాజీ జడ్పీటీసీ తూం అంజిరెడ్డి అడుగుజాడల్లో నడుస్తానని తెలిపారు. పేదలకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో చిన్న వెంకట్‌రెడ్డి, కొంతం కర్నాకర్, గొడుగు స్వామి, మంద మహేష్, కొంతం లింగం, శేఖర్, వధువు తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వేదాలు మానవ మనుగడకు దోహదం

**మాధవానంద సరస్వతి స్వామీజీ**


వేద విద్యార్థికి జయ పట్టా అందజేస్తున్న శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ

**వర్గల్, మే 1 (ప్రభాతవార్త):** వేదాలు మానవ మనుగడకు దోహదపడుతుండగా, సమాజాన్ని జాగృతం చేస్తుందని శ్రీగురుమదనానంద పీఠాధిపతి మాధవానందసరస్వతి స్వామీజీ, శ్రీవిద్యాధరి క్షేత్ర వ్యవస్థాపకులు, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలో గురువారం శ్రీశారదా స్మార్త వేద విద్యాలయ విద్యార్థులకు జయ పట్టా ప్రధానం చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. వర్గల్ క్షేత్రంలో వేద విద్యను పొందిన విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థాయిలో ఉండగా ఆధ్యాత్మికత, జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, నైతికత, సమాజ సంక్షేమం లక్ష్యంగా గురువులు ఇక్కడ విద్యాబోధన అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా వేదం అనేది ఒక విద్య కాకుండా జీవన విధానంగా భావిస్తూ విద్యార్థులు వేద విద్యను విస్తృతం చేసి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. వేద విద్య అభ్యసించే విద్యార్థులు ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ దైవానికి దగ్గరై అక్షర జ్ఞానం, ఆత్మజ్ఞానం పొందుతారని అన్నారు. వేద విద్యలో గురువుల పాత్ర కీలకం కాగా, చిరుప్రాయంలోనే విద్యార్థులకు వేద విద్యను బోధిస్తూ తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. అయితే నైతిక, వ్యక్తిత్వ విలువలు, జ్ఞానం, ధర్మం, ఆధ్యాత్మిక భావన తదితర పెంపొందిస్తుండగా, పురాతన కాలం నుండి వేదాలు మానవ మనుగడకు మూలాలుగా నిలుస్తున్నట్లు చెప్పారు. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటైన వర్గల్ శ్రీ శారద స్మార్త వేద విద్యాలయం ఆకాంక్షలకు అనుగుణంగా వేద విద్యార్థులు దృష్టి సారించడంతో పాటు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.


హరికృష్ణకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

## పోచమ్మ తల్లి దీవెనలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : పూజల హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, మే 1, ప్రభాతవార్త :** పోచమ్మతల్లి దీవెనలతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం పెద్దలింగారెడ్డిపల్లి పోచమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ సర్కారులో అన్ని వర్గాల ప్రజల సుఖ:సంతోషాలతో ఉన్నారని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ మిని ఫంక్షన్ హాల్‌కు పహరీగోడ మంజూరు చేయాలని కోరగా చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు రమేష్, గడ్డం రమేష్, శివకుమార్, పూజల గోపికృష్ణ, సాంబమూర్తి, రాములు, కనకయ్య, మహిపాల్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, కొత్త మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి రెండో ర్యాంక్ సాధించిన విద్యార్థినికి సన్మానం

**గజ్వేల్, మే 1 (ప్రభాతవార్త):** తలకొక్కుల చంద్రకళ లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన విద్యార్థినిని గురువారం ఘనంగా సన్మానించి రూ.5వేల బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్ మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన మ్యాక శ్రీనివాస్, సుజాత దంపతుల కూతురు మ్యాక అరవింద ఇంటర్మీడియెట్ ఎంపిసి ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షల్లో 470 మార్కులకు గానూ 467 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు కైవసం చేసుకుందన్నారు. గజ్వేల్ ఖ్యాతిని నిలబెట్టిన విద్యార్థిని అరవిందతోపాటు తల్లిదండ్రులను అభినందించారు. రాబోయేరోజుల్లో ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ కురుమ సంఘం అధ్యక్షుడు పులి బాల్ చంద్రం, ట్రస్టు కోశాధికారి తలకొక్కుల దుర్గాప్రసాద్, సభ్యులు తలకొక్కుల భాగ్యలక్ష్మి, డాక్టర్ కృష్ణకాంత్, బడికెల నాగమణి, భానుప్రసాద్ పాల్గొన్నారు.

## 10లో మండల టాపర్లుగా చేర్యాల విద్యార్థులు

**కంది, మే 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చేర్యాల జిల్లా పరిషత్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో మెరుగైన ప్రతిభ చాటుతూ మండల టాపర్లుగా నిలిచారు. చేర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వడ్ల గాయత్రి 588 మార్కులతో మండల టాపర్‌గా నిలువగా అదే పాఠశాలకు చెందిన దృశిక 586, అల్పియా 582 మార్కులతో, కె అభినయ 581 మార్కులతో వరుసగా 2,3,4వ స్థానాలను దక్కించుకోగా ఎద్దుమైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రవల్లిక 580 మార్కులు సాధించి 5వ స్థానాన్ని కైవశం చేసుకుంది.

## హైదరాబాద్ రీజియన్‌లో కంగ్టి విద్యార్థి టాప్

**కంగ్టి, మే 1, ప్రభాతవార్త:** హైదరాబాద్ రిజియన్‌లో కంగ్టి టిటిడబ్లుఆర్ ఈఎస్ విద్యార్థి రాథోడ్ పర్సురామ్ 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 582 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ తెలిపారు. కంగ్టిలోని ప్రయివేటు పాఠశాల లిటిల్ స్టార్‌విద్యార్థి 580 మార్కులు మండల స్థాయిలో రెండవ స్థానాన్ని దక్కించుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. కంగ్టిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోరే భాగ్య 568మార్కులతో మూడవ స్థానంలో నిలిచిందని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు యశ్వంత్ తెలిపారు.

## మండలంలో ఒకరు మినహా అందరూ పాస్

**న్యాల్‌కల్, మే 1, ప్రభాతవార్త:** బుధవారం విడుదలైన 10వ తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో మండలంలోని 9 పాఠశాలల్లో 10వ తగరతిలో విద్యను అందుకుని పరీక్షలు రాసిన విద్యార్థులందరూ పాస్ కాగా రోడ్డు ప్రమాదంలో గాయపడి పరీక్షలకు హాజరు కాని న్యాల్‌కల్ పాఠశాల విద్యార్థి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. పాఠశాలల వారిగా పరిశీలిస్తే న్యాల్‌కల్ జిల్లా పరిషత్ పాఠశాలలో 105విద్యార్థులకు గాను 104 మంది విద్యార్థులు, రేజింతల్ పాఠశాలలో 22 మంది, చాల్కి పాఠశాలలో 35 మంది, చీకూర్తి పాఠశాలలో 14 మంది, మిర్జాపూర్(బి) పాఠశాలలో 65 మంది, మామిడ్గి పాఠశాలలో 30 మంది, మెటల్‌కుంట పాఠశాలలో 75 మంది హద్నూర్ పాఠశాలలో 32 మంది, న్యాల్‌కల్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 38 మంది పరీక్షలకు హాజరు కాగా అందరు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాధికారి మారుతి రాథోడ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని మిర్జాపూర్(బి) జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సాధియా నౌశిన్ 579 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

## పదిలో అత్యధిక మార్కులు సాధించిన బాలికల పాఠశాల విద్యార్థులు

**రామాయంపేట, మే 1, ప్రభాతవార్త :** పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సత్తా చూపించారు. బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో 63 మంది విద్యార్థులకుగాను 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.అత్యధికంగా మార్కులు సాధించిన వారిలో హర్షవర్ధన్ 541, విశాల్ 530, నజ్మీన్ ఫాతిమా 516, అలేఖ్య 508, కార్తీక్ 500 మార్కులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## మండల 'పది' టాపర్‌కు సన్మానం

**చిన్నశంకరంపేట, మే 1,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పది ఫలితాలలో మండల పరిధి మదూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని రాజేశ్వరి మండల టాపర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. గురువారం మండల టాపర్‌గా నిలిచిన రాజేశ్వరిని మండల తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎస్ఐ నారాయణగౌడ్‌లు సన్మానిం చారు. వారు మాట్లాడుతూ 10వ తరగతిలో 600 మార్కులకు గాను 570 మార్కులు సాధించిన విద్యార్థిని రాజేశ్వరిని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ మండల టాపర్‌గా నిలివడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రవేటు పాఠశాల కంటే దీటుగా ప్రవేటు పాఠశాలలో విద్యాబోధన అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాములు, శ్రీనివాస్, నరేష్, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, విశ్వం పంతులు, సిద్దిరాములు పాల్గొన్నారు.

## ఘనంగా బసవేశ్వరుడి జయంతి వేడుకలు

**-విగ్రహానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే**

**రామచంద్రాపురం, మే 1, ప్రభాతవార్త:** విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడి 892వ జయంతి వేడుకలను పురష్కరించుకుని వీరశైవ లింగాత్ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం బీరంగూడలోని బసవేశ్వరుడి కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పలమాలలు వేసి ఘనంగా జయంతి ఉత్సవాలు జరుపుకున్నారు. మహాత్మా బసవేశ్వరుడు సమాజ ఉద్ధరణకు చేసిన సేవలను ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.


బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలువేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

